క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

అంబాజీపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని అంబాజీపేట పీహెచ్‌సీ సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. తొండవరం సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 104 వాహన వైద్యులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్నవారికి వైద పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జేవీఎస్ ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ టాలెంట్ టెస్టుకు విశేష స్పందన

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అంబేడ్కర్ టాలెంట్ టెస్టు ఏర్పాటు చేశారు. ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన టెస్టుకు 249 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈదరాడ, మగటపల్లి, ఆదుర్రు, లూటుకుర్రు, మామిడికుదురు పాఠశాలలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ టెస్టులో పాల్గొన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, అంబేడ్కర్ జీవిత చరిత్రపై ఈ టెస్టు ఏర్పాటు చేశారు. ఈ టెస్టులో విజేతగా నిలిచిన వారికి రూ.5 వేల నగదు ప్రోత్సాహం అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.2 వేలు నగదు ప్రోత్సాహాలు అందజేస్తామన్నారు.

భూసేకరణను అడ్డుకున్న గ్రామస్తులు

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో శుక్రవారం అధికారులు తలపెట్టిన భూసేకరణను గ్రామస్తులు అడ్డుకున్నారు. తహసీల్దారు వి.నరసింహారావు అధ్యక్షతన గ్రామంలో తీరప్రాంత రైతులు, ఎస్సీ సొసైటీ సభ్యులతో సమావేశం జరిగింది. ఏవీఆర్ గ్యాస్ అండ్ ఆయిల్ కంపెనీ ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తీరంలో అన్ సర్వే ల్యాండ్ భూసేకరణ నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీనిపై రైతులు మాట్లాడుతూ మొత్తం తీరంలో భూమి సర్వే చేసి నంబర్లు ఇవ్వాలని తరువాత భూసేకరణ కోసం ఆలోచించవచ్చని రైతులు స్పష్టం చేశారు. మానవహక్కుల వేదిక నాయకులు ముత్యాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అసలు ఏవీఆర్ సంస్థ పూర్వాపరాలు వెల్లడించాలని, గతంలో ఓఎన్జీసీ సంస్థల కార్యకలాపాల వల్ల ఇక్కడ ఇప్పటికే అనేక అనర్థాలు తలెత్తుతున్నాయని అన్నారు. రాపాక కిరణ్, గెద్దం సాయిబాబు, ఎస్సీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

మోరిలో చలివేంద్రం ఏర్పాటు

సఖినేటిపల్లి: మోరిలో జాన వీరభద్రయ్య అన్నదాన సత్రం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు జాన శంకరరావు శుక్రవారం ప్రారంభించారు. 1909లో దాత స్వర్గీయ జాన శంకరయ్య, ఆయన తండ్రి జాన వీరభద్రయ్య పేరున వేసవి మూడు నెలలు చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు శంకరరావు తెలిపారు. ఇదే సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నట్టు వారి కుటుంబ సభ్యుడు శంకరరావు అన్నారు. జాన సుబ్బారావు, జాన తాతాజీ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా రాజశేఖర్

ఆలమూరు: స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సంబంధించి శుక్రవారం సంయుక్త కార్యదర్శి పదవికి ఎన్నికల్లో జి.రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఇప్పటికే అధ్యక్షుడిగా సలాది సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడిగా నరాకుల సత్యనారాయణ, కార్యదర్శిగా మాతా మహేశ్వరరావు, కోశాధికారిగా బి.వి ద్యాప్రసన్న ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శి పోటీలో జె.జోగానందరావు మీద 16 ఓట్ల మెజారిటీతో రాజశేఖర్ గెలుపొందాడు.

సామాజిక తనిఖీని సమర్థవంతంగా నిర్వహించాలి

ఆలమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా సర్వశిక్ష అభియాన్ పరిశీలకులు పి.రాంబాబు పిలుపునిచ్చారు. స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయంలో శుక్రవారం పాఠశాలల్లో సామాజిక తనిఖీ అనే అంశంపై ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ అధ్యక్షత వహించగా పరిశీలకులు రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.జిల్లా రిసోర్స్‌పర్సన్లు లక్ష్మీనారాయణ, గోవిందరాజు యాప్‌పై అవగాహన కల్పించారు.

సేవలు అభినందనీయం

పి.గన్నవరం: స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. యర్రంశెట్టివారిపాలెంలో తాడేపల్లిగూడేనికి చెందిన ఆత్మ బంధువుల సేవాసంఘం అధ్యక్షుడు కడియాల పరశురామయ్య, నాగిరెడ్డి శ్రీరామప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాలు పంచుకోవాలని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, రాజమహేంద్రవరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల వైద్య నిపుణులు 350 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, సర్పంచ్ యర్రంశెట్టి త్రివేణి, ఆత్మ బంధువుల సేవా సంఘం సభ్యులు మేడిది పరంధామయ్య, పి.సీతారామయ్య, ఎ.దుర్గారావు, మేడిది చినబాబు పాల్గొన్నారు.

మాసూళ్లతో రైతుల బిజీ



నవాబుపేటలో మాసూళ్లు చేస్తున్న రైతులు

- ఆశాజనకంగా దిగుబడులు
- రైతులకు భరోసా కల్పిస్తున్న కొనుగోలు కేంద్రాలు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహం వల్ల పూర్తి స్థాయిలో సాగునీరు అంది సకాలంలో పంట చేతికందడంతో రైతులు వరి కోతలు, మాసూళ్ల పనిలో బిజీగా గడుపుతున్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పంటకోత ప్రయోగాల ద్వారా 45 నుంచి 55 బస్తాల వరకూ దిగుబడి రావడంతో రైతాంగానికి అనుకోని రీతిలో ఊరట నిస్తుంది. రైతులకు ఫలసాయం చేతికందుతున్న సమయంలో దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను విరివిగా ప్రారంభిస్తోంది. అమలాపురం డివిజన్‌లో పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో దాదాపు 72 వేల ఎకరాల్లో ఎకరాల్లో రైతులు రబీ సాగుచేశారు. అధికశాతం విస్తీర్ణంలో ఎంటీయూ 1121 (శ్రీధృతి), ఎంటీయూ 3626 (బొండాలు) రకాలను సాగు చేయగా కొద్దిపాటి విస్తీర్ణంలో ఆర్‌ఏఆర్ 15048 రకాన్ని సాగు చేశారు. తొలకరి పంటకు విత్తనాల కోసం స్వర్ణ రకం వంగడాలను మరికొంత మంది రైతులు సాగు చేశారు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల కన్నా నియోజకవర్గంలో ముందుగానే రైతులు రబీ సాగు చేయడంతో పంట తుది దశకు చేరుకుంది. వారం రోజుల క్రితమే దాళ్వా కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో పనులు జోరందుకున్నాయి. ఇప్పటి వరకు కొత్తపేట నియోజకవర్గం పరిధిలో దాదాపు సుమారు 45 శాతం మేర కోతలు పూర్తి కాగా మిలిగిన రెండు నియోజకవర్గాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. ఇదే వాతావరణ పరిస్థితి కొనసాగితే మరో పది రోజుల్లో చాలా వరకు పనులు పూర్తవుతాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు 55 బస్తాలు వరకు దిగుబడి

రబీ సీజన్‌లో సాగునీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం తీసుకున్న చర్యలు, తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో పంట ఆశాజనకంగా ఉంది. పంట దిగుబడుల అంచనాకు వ్యవసాయాధికారులు గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో నాలుగు చోట్ల ఈ ప్రయోగాలు జరుగుతున్నాయి. వీటి ఆధారంగా ఎకరాకు 55 బస్తాలు వరకు దిగుబడి వస్తున్నట్టు అధికారులు అంటున్నారు. వరి కోత యంత్రాలు అందుబాటులో ఉండటంతో త్వరితగతిన పంట చేతికి అందుతుంది.

ఆశాజనకంగా దిగుబడి



రబీ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంది ప్రతీ గ్రామంలో నాలుగుచోట్ల పంటకోత ప్రయోగాలు చేస్తున్నాం. ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతు పండించిన ప్రతి గింజను కొంటున్నాం.

– ఎస్.లక్ష్మీలావణ్య, ఏవో, ఆలమూరు

గిట్టుబాటు ధర బావుంది



ఆర్‌బీకెలుల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు గిట్టుబాటు ధరను అందిస్తున్నాయి. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతుకే లబ్ధి చేకూరుతుంది.

– పోలాబత్తుల నాగేశ్వరరావు, రైతు, మినపల్లి



వాడపాలెంలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



మాచవరంలో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

జగన్‌తోనే ప్రజా సంక్షేమం

- వాడపాలెం, మాచవరంలలో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు

కొత్తపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాలకూ పథకాలతో పారదర్శక పాలన అందిస్తుండగా భవిష్యత్‌లో కూడా ఆయన వల్లే ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వాడపాలెంలో శుక్రవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాల వారికి అందిన సంక్షేమ పథకాల షీట్ అందిస్తూ అమ్మా మీకు ఈ పథకాలు అందాయా? అని ఆయా పథకాలు వివరించగా అందాయంటూ అందరూ ఆనందంగా వివరించారు. పలువురు జగ్గిరెడ్డికి సాదరంగా స్వాగతం పలికి పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి కృతజ్ఞతలు చాటుకున్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ వచ్చాక మీ కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను చూసి మీ గుండెలపై చేయి వేసుకుని ఆలోచన చేయండి? జగన్ ప్రభుత్వం వలన మీకు లబ్ధి చేకూరిందని అని భావిస్తే మరోసారి ఆశీర్వదించండి అని జగ్గిరెడ్డి లబ్ధిదారులను కోరారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు నింపి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, వైస్ ఎంపీపీ బండారు సత్యమంగతాయారు. ఎంపీటీసీ సభ్యుడు నేలపూడి భీమరాజు, ఎంఏఎస్‌ఎం చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, పార్టీ నాయకుడు బండారు లక్ష్మణ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలన సువర్ణాధ్యాయం

అంబాజీపేట: దేశ చరిత్రలో సీఎం జగన్ సంక్షేమ పాలన ఒక సువర్ణ అధ్యాయమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం సచివాలయం 3లో పార్టీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజుల ఆధ్వర్యంలో గడపగడపకూ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు, రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ గడపగడపకూ తిరిగారు. వలంటీర్ల వ్యవస్థతో ఇంటి వద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందించే పరిస్థితులను సీఎం కల్పించారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా జగన్‌ని మరలా గెలిపించుకునేందుకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని, ఇళ్ల స్థలాలు, హౌసింగ్‌లోన్లు ఇవ్వాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. త్వరలో గ్రామంలోని మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ విభాగ కన్వీనర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, ఎంపీటీసీ మట్టా పార్వతి, పార్టీ జిల్లా ప్రచార విభాగ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, కుడుపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం

పి.గన్నవరం: లంకల గన్నవరంలో వేంచేసిన మహాలక్ష్మి అమ్మవారి తీర్థం శుక్రవారం వైభవంగా జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ నాయకులు వివిధ ఏర్పాట్లు చేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యేకి ఆలయ కమిటీ చైర్మన్ సభ్యులు స్వాగతం పలికారు. ఆయన వెంట పార్టీ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, చిట్టాల ఆర్యశ్రీను, చొల్లంగి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

ప్రజాభిప్రాయం మేరకే పాలన

సఖినేటిపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రజాభిప్రాయం మేరకే జరుగుతోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం సఖినేటిపల్లి సువర్ణపేటలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి వెళ్లి ఎమ్మెల్యే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి నాడు గత టీడీపీ ప్రభుత్వ పాలన, నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాన్ని ఆయన వివరించారు. కాగా నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. సీఎం జగన్ వచ్చిన తరువాత పేదలకు, సామాన్యులకు జరుగుతున్న మేలును వివరించారు. ఐదు ప్రశ్నలకు అభిప్రాయాలను సేకరించి, ప్రజామద్దతు పుస్తకంలో నమోదు చేసి, వారి ఆమోదంతో వారి ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అతికించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ మిస్డ్ కాల్ చేయించారు. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం, పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు రుద్రరాజు రంగరాజు, రాపాక సూరయ్య పాల్గొన్నారు. అలాగే ఉయ్యూరువారి మెరక మధ్యగ్రూపులో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, ఏఎంసీ డైరెక్టర్ మేడిది రెడ్డి సచివాలయ కన్వీనర్, గృహసారథి, వలంటీర్‌తో కలసి వెళ్లి నిర్వహించారు.



సఖినేటిపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

అయినవిల్లి: రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం అయినవిల్లి పీఏసీఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపి రైతులకు మేలు చేశారన్నారు. రైతులు నేరుగా ధాన్యం అమ్ముకుని నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు నంబూరి రాంబాబు, సర్పంచ్ కాకర శ్రీను, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, ఏవో శోభ, వార లక్ష్మినరసింహారామ్, కొత్త కృష్ణ, పేరి శ్రీను, వాసంశెట్టి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: ప్రభుత్వం ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రతి వరి గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చిరతపూడి, గంగలకుర్రు సొసైటీల వద్ద అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్, మట్టపర్తి చంద్రశేఖర్‌ల అధ్యక్షతన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. చిట్టిబాబు మాట్లాడుతూ దళారులను ఆశ్రయించకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, కాంత్రేగుల శ్రీనివాసరావు, ఎంఏఎస్ఎం చైర్మన్ ఎంఎం శెట్టి, విత్తనాల శేఖర్, బొక్కా శ్రీనివాస్, మట్టపర్తి నాగరాజు, పితాని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: కౌలురైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న రుణ పథకం సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి (ఏఓ) పి.పద్మలత సూచించారు. కౌలురైతుల రుణ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని అవిడి గ్రామాన్ని ఎంపిక చేశారు. దానితో పాటు అవిడి పీఏసీఎస్ వద్ద రబీ (దాళ్వా) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సర్పంచ్ రెడ్డి చంటి ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వానికి విక్రయించి మద్దతు ధర పొందాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దూళి సూరిబాబు, నేతల వెంకటలక్ష్మి, కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్‌కుమార్, వీఆర్‌ఓ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సొసైటీల అభివృద్ధికి బాటలు వేయాలి

అంబాజీపేట: సొసైటీల చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి వాటి అభివృద్ధికి బాటలు వేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చిరతపూడి సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన బొంతు శ్రీనివాస్ పదవీ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అధ్యక్షతన సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారాన్ని శుక్రవారం నిర్వహించారు. సీఈఓ కుంపట్ల సత్యనారాయణ పర్యవేక్షణలో చైర్‌పర్సన్ శ్రీనివాస్‌తో పాటు సభ్యులు నక్కా సత్యనారాయణ, రంపం గోవిందులతో ఎమ్మెల్యే చిట్టిబాబు, పార్టీ రాష్ట్ర నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావులు ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్‌పర్సన్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే చిట్టిబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్‌లు కోట బేబిరాణి, తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ముత్తాబత్తుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపానికి రూ.50 వేల విరాళం

ఆలమూరు: స్థానిక భువనేశ్వరి చెరువు వద్ద నిర్మిస్తున్న శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపానికి పారిశ్రామికవేత్త సంధిపూడికి చెందిన అడపా భాస్కర రామ్మూర్తి రూ.50 వేల విరాళం ఇచ్చారు. కాపు అభ్యుదయ సంఘ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావుకు ఆయన నివాసంలో ఆ విరాళం మొత్తాన్ని శుక్రవారం అందజేశారు. కాపు సంఘం నాయకులు రామానుజుల శేషగిరిరావు, సలాది నాగేశ్వరరావు, శిరిగినీడి పట్టాభి, చల్లా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని గోపాలపురం పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అలాగే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా సూచనలు, తీర్మానాలు ఆమోదించారు. ఎంపీపీ లక్ష్మీ వెంకట నాగదేవి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్పత్రులకు మెరుగైన వైద్య పరికరాలు, వైద్యులు, సిబ్బంది కావాల్సిన మేరకు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రులను నాడు–నేడు పనులతో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసిందన్నారు. వీటితో ప్రజలకు వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందించాలన్నారు. సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో లేబొరేటరీకి నూతనంగా మంజూరైన ఆధునిక రక్తపరీక్షలు చేసే పరికరాలను, వ్యాక్సిన్ స్టోరేజీ ఆమె పరిశీలించారు. వాటి పనితీరును సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, గోపాలపురం సర్పంచ్ సబ్బితి మోహన్‌రావు, పొడగట్లపల్లి సర్పంచ్ గంధం దేవి, తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, డాక్టర్లు షాయిలేఖ, స్వాతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలపురం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగదేవి

ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

రాజోలు: రాజోలు ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం రాజోలు సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆస్పత్రిలో ఈఎన్టీ, ఆర్థోపెడిక్ వైద్యులతో పాటు గైనిక్ వైద్యనిపుణులు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. అలాగే ఈఎన్‌టీ సేవలకు వినియోగించే వస్తుసామగ్రిని కొనుగోలు చేసేందుకు సమావేశంలో తీర్మానించారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రతగా ఉంచడంతో పాటు ఆస్పత్రికి వచ్చిన రోగులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రులను మరింత అభివృద్ధి చేస్తుందన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులు కుంపట్ల చిన్నారి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, సూపరింటెండెంట్ అప్పారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వనువులమ్మకు ఎమ్మెల్యే పూజలు

రాజోలు: స్థానిక వనువులమ్మ ఆలయంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శుక్రవారం పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. వనువులమ్మ, కనకదుర్గమ్మ వార్ల జాతర ఉత్సవాలు ముగిసిన సందర్భంగా ఆలయం వద్ద మహా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రాపాకకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, అడబాల జానకీరామ్, మొల్లేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో అప్రమత్తత ముఖ్యం



ప్రాణరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

మలికిపురం: తుపాన్ల వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలికిపురం తహసీల్దార్ వీవీ నరసింహారావు పేర్కొన్నారు. కేశనపల్లిలో తుపాను ఆశ్రయ భవనంలో 10వ ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో జరిగిన అప్రమత్తత, అవగాహన, డెమో ప్రదర్శనలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విపత్తుల సమయంలో నష్ట నివారణకు అధిక ప్రాధాన్యం ఉంటుందని, ఆ దిశగా తగిన శిక్షణ, సన్నద్ధతతో ఉండాలని ఆయన సూచించారు. రానున్న కాలం తుపాన్లు సంభవించే సమయమని, అందుకు తగిన విధంగా ప్రభుత్వం అన్ని విధాలుగా పూర్తి సన్నద్ధంగా ఉందని తెలిపారు. సర్పంచ్ యెనుముల నాగు అధ్యక్షతన జరిగిన సభలో బెటాలియన్ కమాండర్ టి.రాజేష్‌కుమార్ సరోజ్, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు ఎంపీడీఓ ఉండ్రు బాబ్జిరాజు, సర్పంచ్‌లు మందపాటి నాగేశ్వరరావు, రాపాక ఆనంద కుమార్, గుర్లింక సత్తిబాబు, ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

సఖినేటిపల్లి: విద్యావ్యవస్థలో పేరెంట్స్ కమిటీల ద్వారా తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో నల్లి మనోహరం అధ్యక్షతన మండల స్థాయిలో హెచ్‌ఎంలకు సోషల్ ఆడిట్ వినియోగంపై ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఎంపీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా సెక్టోరియల్ అధికారి బొరుసు సుబ్రహ్మణ్యం, జిల్లా రిసోర్స్ పర్సన్లు ఎం.వెంకటేశ్వరరావు, సీహెచ్.వీరభద్రానందం పై శిక్షణను నిర్వహించారు. మండల స్థాయిలో శిక్షణ పొందిన హెచ్‌ఎంలు ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీలకు సామాజిక తనిఖీ యాప్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంఈవో మనోహరం అన్నారు. ఎంపీడీవో జీ.భీమారావు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జనరేటర్ సమర్పణ

ఆత్రేయపురం: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయానికి దాత దేశిరాజు సత్యంబాబు రూ.40 వేల విలువైన 1.2 కేవీ జనరేటర్ సమర్పించారు. ఆయన తండ్రి వెంకట్రావు ఉమా కమండలేశ్వర స్వామి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ దాత, ధ్వజస్తంభం ఏర్పాటులో భాగస్వామిగా కూడా ఉన్నారు.

ప్రజలకు చేరువలో ప్రభుత్వ సేవలు

కలెక్టర్ హిమాన్షుశుక్లా

కొత్తపేట: మండలంలోని వాడపాలెంలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం–2 భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన అగ్రికల్చర్ ప్రొడక్ట్స్ స్టోరేజ్, ఆర్బీకే భవనం, రూ.15.74 లక్షలతో నిర్మించిన జగనన్న పాలవెల్లువ సెంటర్ భవనాలను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా ప్రారంభించారు. ఆర్బీకేలో వివిధ విభాగాలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. రూ.70 వేల రాయితీపై రూ.2.05 లక్షలు విలువైన రెండు పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలనా సౌలభ్యాలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందేనన్నారు. దానికి అనుబంధంగా ప్రజారోగ్యానికి వెల్‌నెస్ సెంటర్, రైతులకు ఆర్‌బీకే, బల్క్‌మిల్క్ సెంటర్లను తీసుకువచ్చిందన్నారు. అందుబాటులోకి వచ్చిన ఆయా శాఖల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్‌బీకే ద్వారా యంత్రసేవా కేంద్రాలను మండలం యూనిట్‌గా అమలు చేయాలని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, కలెక్టర్ సమక్షంలో వ్యవసాయ శాఖ ఏడీ ఎం.వెంకటరామారావుకు సూచించారు. దానిపై కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ మండలం యూనిట్ అంశాన్ని తనకు ఫైల్ పెట్టండి.. తాను కమిషనర్‌కు సర్క్యులేట్ చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.ముక్కంటి, రాష్ట్ర పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్ త్సామా బాబు, వైస్ ఎంపీపీ బండారు సత్యమంగతాయారు, ఎంపీటీసీ సభ్యుడు నేలపూడి భీమరాజు, ఎంఏఎం చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఉపాధిహామీ పథకం ద్వారా సాగునీటి ఇబ్బందులు పరిష్కారానికి వేసవిలో పంటకాలువలు, మురుగు కాలువలు పూడికతీత పనులు ఎక్కువగా చేపట్టడంతో పాటు వేతన కూలీలకు సరాసరి వేతనాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని లొల్ల, మెర్లపాలెం గ్రామాల్లో కలెక్టర్ జిల్లా అధికారులతో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పంటకాలువ పూడికతీత పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వివిధ అంశాలపై ఆరా తీశారు. అనంతరం రైతులు సాగు క్షేత్రంలో ధాన్యం రాశులను పరిశీలించారు. రైతులను దిగుబడి గురించి ఆరా తీయగా తమకు 55 బస్తాలు దిగుబడి వస్తుందని కానీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం 45 బస్తాలే కొనుగోలు చేస్తున్నారని మిగిలిన 10 బస్తాలు కూడా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ప్రభుత్వ ఉన్నతాధికారులకు సమస్యను నివేదించి కొనుగోలు చర్యలు చేపడతామన్నారు. వివిధ సమస్యలపై వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. అలాగే కట్టుంగ ఆంజనేయ స్వామి ఆలయ భూములకు సంబంధించి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ తులసి, ఆర్‌డీవో ఎం.ముక్కంటి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వరరావు, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దార్ డి.అనిల్‌కుమార్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎన్.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



వాడపాలెంలో బల్క్‌మిల్క్ సెంటర్ ప్రారంభించిన కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి